

భారత్
# ప్రతినిధి
తెలుగు దిన పత్రిక




సంపుటి: 3 సంచిక: 316 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు మంగళవారం, 08 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 316 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR TUESDAY, 08 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI

## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో
# నడిపిద్దాం

- స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు
- విజన్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేద్దాం
- కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీకి బలం
- టీడీపీ కార్యకర్త హుషారుగా ఉండాలి
- ప్రతి నియోజకవర్గానికి కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలోనే
- వైసీపీది ఉగ్రవాదుల తరహా పాలిటిక్స్
- ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నేతలకు దిశానిర్దేశం




**అమరావతి, సెప్టెంబర్ 07:** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం మిగతా2లో...

## పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు
# ఒకే నిబంధన

### - గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 07:** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును

# ఎన్సీసీఎఫ్ ఎండీతో మంత్రి మనోహర్ చర్చలు



### - రాష్ట్రంలో నిత్యావసరాల సరఫరా, ధరల నియంత్రణపై చర్చ

**అమరావతి, సెప్టెంబర్ 07:** ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సి సిఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్‌ని

## ఏపీ వక్ఫ్ బోర్డు డిజిటల్ పాలనలో
# మరో ముందడుగు

● త్వరలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ప్రారంభం ● ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ● ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



**అమరావతి, సెప్టెంబర్ 07:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. బోర్డు సేవలు, కార్యకలాపాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపొందించామని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు మిగతా2లో...

## ఏపీలోని పలు ప్రాంతాలకు
# భారీ వర్ష సూచన



**అమరావతి, సెప్టెంబర్ 07:** ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు కీలక జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రాబోయే మూడు గంటల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో మిగతా2లో...



# నిరుద్యోగులపై బురదజల్లుతారా?

### కష్టపడి మెగా డీఎస్సీ సాధించారు
### ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఫైర్

**అమరావతి, సెప్టెంబర్ 07:** మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం

## తాతా మధును
# బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

### - సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్: సెప్టెంబర్ 07:** శాసనసభ స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. దళిత వ్యక్తిని ప్రతిపక్ష నేతగా మిగతా2లో...

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను
# అడ్డుకోవద్దు

### - రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు


2లో

# అసెంబ్లీలో స్పీకర్ కంటతడి



**హైదరాబాద్:సెప్టెంబర్ 07:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు, మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్‌ను కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంఘీభావం తెలిపారు. ఈక్రమంలోనే స్పీకర్ భావోద్వేగానికి గురయ్యారు. స్పీకర్ గౌరవాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. బీజేపీకి కూడా బాధ్యత ఉందని చెప్పారు. బీజేపీ నేతలు సభకు సహకరించాలని కోరారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అవమానిం చడంపై బీజేపీ వైఖరి చెప్పాల ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్నారని ధ్వజ మెత్తారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయ డం దుర్మా ర్గమని అన్నారు. అధికా రంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ రూల్స్ పాటించలేదని.. ఇప్పుడు ప్రతిపక్షంలోనూ రూల్స్ పాటించట్లేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహించారు. అయితే, స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోను సీఎంవో విడుదల చేసింది.

# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు.కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

మరోవైపు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కేవలం గౌరవం ఇవ్వడమే కాకుండా, వారికి రాజకీయ, ఆర్థిక సాధికారత కల్పించడమే అధినేత చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళగిరిలో జరిగిన టీడీపీ లీడర్‌షిప్ శిక్షణా సదస్సులో 'రాజకీయ, ఆర్థిక సాధికారత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 2040 నాటికి దేశంలో సాధారణ తలసరి ఆదాయం రూ.50 లక్షలకు చేరితే, టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఆదాయం నీతివంతమైన మార్గాల్లో రూ.75 లక్షలు దాటాలనేది చంద్రబాబు ఆకాంక్ష అని ఏలూరి వెల్లడించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల్లో ఉండే కోటి మందికి పైగా సభ్యులున్న ఏకైక పార్టీ టీడీపీ అని ఆయన కొనియాడారు. కార్యకర్త ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. నారా లోకేశ్ ఆలోచనతో కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, తల్లిదండ్రులను కోల్పోయిన కార్యకర్తల పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ సభ్యత్వ కార్డు కేవలం గుర్తింపు మాత్రమే కాదని, అది ఆ కుటుంబానికి పార్టీ ఇస్తున్న బీమా, విద్య, వైద్య, ఉపాధి భరోసా అని వర్ణించారు. సాధారణ విద్యార్థి నాయకుడిగా ఉన్న తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా, కేవలం ప్రతిభ ఆధారంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ఘనత చంద్రబాబుదేనని ఏలూరి గుర్తుచేసుకున్నారు. పార్టీలో సిఫార్సులకు తావులేదని, ప్రతిభకే పట్టం కడతారని స్పష్టం చేశారు. నారా లోకేశ్ నేతృత్వంలో 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతంతో నవతరం నాయకత్వాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ "నా తెలుగుదేశం - నా బాధ్యత" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

**మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు**

**ఆ రెండు ముమ్మాటికీ ఫ్యాక్షన్ పార్టీలే..**

**ప్రజలకు గోరంత, తమకు కొండంత**

**విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**అమరావతి, సెప్టెంబర్ 07:** "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. టీడీపీ, వైసీపీలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రజలకు గోరంత, తమకు కొండంత" అన్నట్లుగా ఈ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కి చెప్పారు.

# 28 జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌ల నియామకం

**స్థానిక సమరానికి టీడీపీ సన్నద్ధం**



**అమరావతి, సెప్టెంబర్ 07:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సర్వసన్నద్ధమవుతోంది. ఈ దిశగా ఎన్నికల కసరత్తును వేగవంతం చేస్తూ, రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈసారి సరికొత్త వ్యూహాన్ని అనుసరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసారి అభ్యర్థుల ఎంపిక బాధ్యతను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీలోని ఇతర కీలక నేతలకు అప్పగించారు. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను క్రియాశీలం చేయడంతో పాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి కీలక బాధ్యతలను ఈ ఇన్‌ఛార్జ్‌లు నిర్వర్తించనున్నారు. విజయనగరానికి ఎంపీ చింతకాయల విజయ్, తూర్పుగోదావరికి దేవినేని ఉమామహేశ్వరరావు, పల్నాడుకు కొనకళ్ల నారాయణ, పశ్చిమగోదావరికి ఎంపీ భాష్యం రామకృష్ణ వంటి పలువురు సీనియర్లకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఫలితాల్లో ఏమాత్రం తేడా వచ్చినా సహించేది లేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. త్వరలోనే తాను కుప్పంలో పర్యటిస్తానని కూడా చంద్రబాబు వెల్లడించారు.

# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా**

**12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు**



**బాఘ్‌పత్, సెప్టెంబర్ 07:** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణి కుల తో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగి స్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## ఎన్సీసీఎఫ్ ఎండీతో మంత్రి మనోహర్ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో కేంద్ర ప్రభుత్వ సంస్థల సహకారాన్ని మరింత విస్తృతం చేస్తూ, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా ముందుకు వెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేతోనూ మంత్రి నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగ దారుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా, కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం, సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఈ భేటీలో నిర్ణయించారు.

## ఏపీ వక్ఫ్ బోర్డు డిజిటల్ పాలనలో మరో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీఈఓ యాకూబ్ ఖాజీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో చైర్మన్ అబ్దుల్ అజీజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సందేశం అందించారు. చైర్మన్ మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను ప్రారంభించడం ఒక్కటే కాదని, దాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యమని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ మార్పులో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా వక్ఫ్ బోర్డులోనూ ఆధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారిక ప్రారంభానికి ముందే సిబ్బందిని కొత్త వ్యవస్థ వినియోగానికి సిద్ధం చేస్తున్నామని, తద్వారా పరిపాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. చైర్మన్ సందేశం అనంతరం ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, వెబ్‌సైట్, మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. లాగిన్, సమాచార నమోదు, ఇప్పటికే ఉన్న వివరాల పరిశీలన, అప్‌డేషన్, క్షేత్రస్థాయి సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో పొందుపరిచే విధానాలను దశలవారీగా వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బంది లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఈఈ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

## ఏపీలోని పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన

(మొదటి పేజీ తరువాయి)

పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాలపై ప్రభావం అధికంగా ఉండనుందని విపత్తుల సంస్థ పేర్కొంది. ముఖ్యంగా గురజాల, మాచర్ల, దర్శి, కందుకూరు, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేటతో పాటు వాటి పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షంతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఎస్డీఎంఏ విజ్ఞప్తి చేసింది. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద, ఇతర తాత్కాలిక షెడ్ల కింద నిలబడటం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని కోరింది.

## నిరుద్యోగులపై బురదజల్లుతారా?

(మొదటి పేజీ తరువాయి)

అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు.

యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**హైదరాబాద్: సెప్టెంబర్ 07:** తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఉద్రిక్తతల పై రాష్ట్ర హోం శాఖకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఎమ్మెల్యేలపై పోలీసులు చర్యలు తీసుకో వద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మెల్యే లపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను గుర్తించాలని, ఈ ఘటనపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ అంశంలో డిజిపి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చూడలేకపోతున్నారని సీఎం అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక ఆలోచనను సరిదిద్దకపోతే భవిష్యత్ తరాలు ఈ సభను క్షమించవన్నారు. ఈ రకమైన అవమానం ఎప్పుడూ, ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశానికి సంబంధించి కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. స్పీకర్ చైర్‌ను అభ్యంతరకర భాష మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధును బీఆర్ఎస్ డిస్మిస్ చేయాలన్నారు. తాతా మధుతో రాజీనామా చేయించాలని.. లేకపోతే బర్తరఫ్ చేయాలన్నారు. తాము ఏం మాట్లాడినా వెనుక కేసీఆర్ ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారత్
ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు
మంగళవారం, 08 సెప్టెంబర్ 2026 వార్తలు

# గుంటూరు నగరపాలక సంస్థకు ఒకే వేదికపై 2 ప్రతిష్టాత్మక అవార్డులు

### స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 పట్టణాల కేటగిరిలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం
### రాష్ట్ర స్థాయి వార్డ్ ల కేటగిరిలో తొలి స్థానం
### కమిషనర్ కె.మయూర్ అశోక్




**గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్:** వాయు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఈ-ఆటోల ద్వారా కాలుష్యరహితంగా చెత్త సేకరణ చేయడం, మెకనైజ్డ్ గా మెయిన్ రోడ్ల స్వీపింగ్, ఘన వ్యర్థాలను సాంకేతిక విధానంలో నిర్వహించడం, డ్రైన్ టు డ్రైన్ రోడ్ల నిర్మాణం, రోడ్లపై దుమ్ము లేవకుండా నీటిని స్ప్రే చేయడం, వార్డ్ స్థాయిలోనే ఆర్ఆర్ఆర్ సెంటర్, సిడిడి వ్యర్థాల సేకరణ పాయింట్స్, క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ల ద్వారా వ్యర్థాల సమర్ధ నిర్వ హణతో జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి నేషనల్ క్లీన్ ఎయిర్ సిటీగా ప్రతిష్ఠాత్మక గుర్తింపును సొంతం చేసుకుంది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 130 నగరాల మధ్య నిర్వహించిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ – 2026' పోటీల్లో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటింది. 'స్వచ్ఛ వాయు దివస్' సందర్భంగా న్యూఢిల్లీలోని ఇందిరా పర్యా వరణ్ భవన్ (గంగా ఆడిటోరియం)లో సోమవారం ఉదయం నిర్వ హించిన ప్రత్యేక కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైర్పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, అదనపు కార్యదర్శి అమన్ దీప్ గార్గ్ ల చేతుల మీదుగా గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని స్వీకరించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో వార్డ్ ల కేటగిరీ 2 (10 వేల నుండి 30వేల జనాభా) విభాగంలో గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన 42వ వార్డు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వందలాది నగరాలతో పోటీపడి గుం టూరు నగరం ద్వితీయ స్థానంలో నిలవడం నగరవాసులందరికీ ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. నగరంలో వాయు నాణ్యతను మెరుగు పరిచేందుకు క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన పారిశుధ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా గుం టూరును మరింత పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పచ్చని నాగ గుంటూరు నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజినీరింగ్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, కోమలి పాల్గొన్నారు.

# యువత భవిష్యత్‌ను గొడ్డలి పార్టీ అడ్డుకునే కుట్ర చేస్తుంది

### గుంటూరు ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏ మంచి పని చేసినా అడ్డుకోవడం, తప్పుడు ప్రచారం చేయడమే పనిగా జగన్ రెడ్డి, గొడ్డలి పార్టీలు పెట్టుకున్నాయని టీడీపీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మెగా డిఎస్సి కూడా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది. ప్రతి విషయంలో ఒక ట్రాన్పరెంట్ గా డిఎస్సిని 148 రోజుల్లో నిర్వహించాం. దాదాపు 15,941 ఉద్యోగాలను రికార్డ్ టైంలో భర్తీ చేస్తే, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని, ఒక్క డిఎస్సి కూడా పెట్టలేని జగన్ రెడ్డి నేడు నోటికొచ్చినట్టు మాట్లాడుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. ఆర్భాట నిర్వహించే విధంగా మంత్రి నారా లోకేష్ మెగా డిఎస్సిని నిర్వహించారు. జాబ్ క్యాలెండర్, ఇళ్ల పట్టాలు, పేదలకు ఇళ్లు వంటి అనేక హామీలు ఇచ్చి జగన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తే,మేం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఏటా డిఎస్సి నిర్వహించేలా ప్రణాళికలు రచించాం. యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే మెగా డిఎస్సి నిర్వహించాం. 2026 మే నుంచి గొడ్డలి పార్టీ ఒక తామాషా ప్రారంభించింది. హై కోర్టుకు పోవడం పిల్ వేయడం, కోర్టు కొట్టేయడం, వైసీపీ నాయకులకు చివాట్లు పెట్టడం షరమాములగా అయింది. ఇప్పుడు కొత్తగా కూటమి ప్రభుత్వంపై డిక్టేటర్ షిప్ అంటూ సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. హైకోర్టు చెప్పింది కూడా అర్థం చేసుకోలేని అజ్ఞాలు వైసీపీలో కొనసాగుతున్నారు. రాజకీయం చేయాలంటే చాలా అంశాలు ఉన్నాయి. కానీ మన పిల్లల భవిష్యత్‌పై జగన్ రెడ్డి దాడి చేస్తున్నాడు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రెస్ మీట్ పెట్టి మరీ ఎలాంటి తప్పు జరగలేదని చెబుతున్నా కూడా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. సీబీఐ విచారణ దేనికి వేస్తారో కూడా తెలియని అసమర్థుడు జగన్. జగన్ రెడ్డి రాజకీయ జీవితమే ఒక ఫేక్. అందుకే ఆయనకు ప్రతిదీ ఫేక్ లా కనిపిస్తుంది. తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? కర్నూలు జిల్లాకు చెందిన భార్య, భర్తల కరిష్మా, షేక్ ఇమామ్‌లపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఒక్క ఆధారం కూడా లేకుండానే డిఎస్సిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చదువుతున్నప్పుడు మాత్రమే స్పోర్ట్ సర్టిఫికేట్ తెచ్చుకోవాలని ఏ రూల్స్ ప్రకారం ఉందో గొడ్డలి పార్టీ నాయకులు సమాధానం చెప్పాలి. భార్య ఒక కేటగిరి, భర్త మరో కేటగిరిలో ప్రతిభ చాటారు. ఉద్యోగాలు తెచ్చుకున్నారు. భార్యభర్తలు ఉద్యో గాలు పొందకూడదనే రూల్ ఎక్కడైనా ఉందా.? పారదర్శకంగా ఉద్యోగాలు సాధించిన యువత జీవితాలతో గొడ్డలి పార్టీ రాజకీ యం చేస్తోంది. దేశంలో 60 ఏళ్ల వయసు ఉన్న వాళ్లు కూడా అథ్లెటిక్స్ లో ప్రతిభ చాటుతున్నారు. గోల్డ్ మెడల్ సాధిస్తున్నారు. 41 ఏళ్ల కొరడా పద్మజా స్పోర్ట్స్ లో ప్రతిభ చాటిన మహిళ. అథ్లెటిక్ లో మెడల్ సాధించి ఉద్యోగం సాధిస్తే ఎలా 41 ఏళ్లకి స్పోర్ట్స్ ఆడిందని మాట్లాడే గొడ్డలి పార్టీ నాయకులకు సిగ్గుండాలి. 41 ఏళ్లకి స్పోర్ట్స్ ఆడకూడదు అనే నియమం ఏమీ లేదు కదా. నిజా యితీగా ఉద్యోగాలు సాధించిన వారి పట్ల వైసీపీ ఎందుకు ఇంత విషపూరిత రాజకీయాలు చేస్తోంది. రేపు భవిష్యత్ లో జరగబోయే మరో డిఎస్సిని అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ ఇప్పటి నుంచే సిద్ధ మవుతోంది. ప్రతి ఏటా డిఎస్సి ఇస్తామని లోకేష్ ప్రకటించారు. రాబోయే డిఎస్సి నియామకాలను తప్పుబట్టి యువతకు ఉద్యోగాలు సాధించకుండా అడ్డుకునే కుట్రకు జగన్ తెర తీశాడు. యువత అంతా మరో డిఎస్సీ కోసం సిద్ధమవుతుంటే, మరో డిఎస్సీని అడ్డు కునేందుకు జగన్ రెడ్డి, గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది. ఫేక్ ప్రచారాలతో, తప్పుడు ఆధారాలతో, ఏపీపీఎస్సీ, డిఎస్సీకి తేడా తెలియదు, స్పోర్ట్స్ కి, బ్రిడ్జ్ గేమ్, పేకాటకు తేడా తెలియదు. ఒక మాట అనేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకునే గొడ్డలి పార్టీ, ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లతో ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష పత్రాలు దిద్దించారు. మరీ వైసీపీని బర్తరఫ్ చేస్తారా సజ్జల రామకృష్ణారెడ్డి సమాధానం చెప్పాలి. గ్రూప్ 1 తప్పిదాలపై జగన్ రెడ్డి రాజీనామా చేసి రాజకీయాలు వదిలేస్తాడా? సొంత పార్టీ నాయకులకు డిఎస్సీ పరిక్షలు రాయించి, వారిచేతనే నేడు తప్పుడు ఆరోపణలు చేస్తూ డ్రామాలు ఆడుతున్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలతో సానుభూతి రాకపోగా, ఇంకా కిందికి పడిపోతారు. యువత జీవితాలతో ఆడుకోవద్దని జగన్ రెడ్డిని కోరుతున్నాం. ప్రతి ఏటా నిర్వహించే డిఎస్సిలో యువత ఉద్యోగాలు సాధిస్తారు, జగన్ నాలుగు గోడల మధ్య మాట్లాడే మాటలు గొడ్డలి పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పనికొచ్చేవి చేస్తే బాగుంటాయి. కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబు, లోకేష్ ల విధానాలపై మాట్లాడే అర్హత జగన్ కు లేదు. ప్రజలు ఇప్పటికే జగన్ రెడ్డిని ఛీ కొడుతున్నారన్నారు.

# కొత్త పింఛన్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ






**గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అర్హత కలిగిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ ని కొత్తగా అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7వ తేదీ నుండి 16వ తేదీ వరకు దరఖాస్తులను అన్ని స్వర్ణ వార్డు కేంద్రాల్లో తీసుకోవాలని ఇచ్చిన ఉత్తర్వుల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 206 స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కొత్త పింఛన్ల కొరకు దరఖాస్తులను స్వీకరించడం, దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశల వారీగా పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతో పాటు తమ కేటగిరీకి సంబంధించిన ధృవపత్రాలను స్వర్ణ వార్డు కార్యాలయాలలో 16వ తేదీ లోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. వృద్ధాప్య పింఛనుకు వయస్సు నిర్ధారణ కొరకు ఆధార్, వితంతు పింఛను కొరకు భర్త మరణ ధృవీకరణ పత్రం, భర్త ఆధార్ నంబర్ సమర్పించాలని, ఒంటరి మహిళా పింఛనుకు అవివాహిత కేటగిరీలో తహశీల్దారు జారీ చేసిన ధృవీకరణ పత్రం, వివాహిత కేటగిరీలో కోర్టు లేదా అదాలత్ ద్వారా జారీ చేసిన విడాకుల పత్రం అవసరమవుతాయన్నారు. దివ్యాంగుల పింఛనుకు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ అంగవైకల్యాన్ని నిర్ధారించే సదరం ధృవపత్రాన్ని జతచేయాలని, అలాగే చేనేత, మత్స్యకార, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులు ఆయా శాఖలు లేదా జిల్లా వైద్య మండలి జారీ చేసిన ధృవపత్రాలను దరఖాస్తుతో పాటు అందజేయాలని సూచించారు. ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ధృవీకరణ ప్రక్రియ జరుగుతుందని, దరఖాస్తును ఆన్‌లైన్ చేసిన వెంటనే సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్మెంట్ అందజేస్తారని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 17 నుంచి 21 వరకు సాధారణ అర్హతల పరిశీలన, సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు భౌతిక, శాఖాపరమైన ధృవీకరణ మరియు అర్హత నిర్ణయం పూర్తి చేసి అధికారులకు నివేదిస్తారని, ఆ తర్వాత సెప్టెంబర్ 25, 26 తేదీలలో సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన తర్వాత అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. కనుక అర్హులైన వారు తమ సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



### పిజిఆర్ఎస్లో వచ్చిన అర్జీలను
# నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
### జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ

**గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం నాణ్యతతో కూడినదై ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల సత్వర పరిష్కారం కోసం అర్జీలను అందజేస్తుంటారని వారి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలన్నారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యంకాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతి బసు, డ్వామా పిడి శంకర్, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, లక్ష్మీ కుమారి, జిల్లా మైనారిటీ ఆఫీసర్ జె.పార్థసారథి ప్రజల నుంచి ప్రజా సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారుల కు అంద జేశారు. జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 525 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 284, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 172 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 10 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 22 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 35, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 2 అర్జీలు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)కు జిల్లా అటవీ అధికారి ఎం.హిమ శైలజ, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, డి.టి.సి సీతా రామి రెడ్డి , జిల్లా ఉపాధి కల్పనా అధికారి అభినవ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ చౌదరి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహా రెడ్డి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో ప్రారంభమైన 'లీడర్షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్'
### కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి





**గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో రెండు రోజుల 'లీడర్షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్' ప్రారంభమైంది. తొలిరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్తో కలిసి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

## తుమ్మికపల్లి నూకలమ్మ ఆలయం సమీపంలో విషాద ఘటన



**కొత్తవలస, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కొత్తవలస మండలం, గ్రామానికి చెందిన బోని వెంకటేష్ (33) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటేష్ తన యాక్టివా స్కూటీ (ఏపి 39 ఆర్ఆర్ 4092)పై ఒంటరిగా ప్రయాణిస్తూ తుమ్మికపల్లి నూకలమ్మ ఆలయం సమీపానికి చేరుకున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఏపిఎస్ఆర్టిసి బస్సు (ఏపి 39 టిఈ 1166) ఢీకొట్టింది. దేవరపల్లి నుంచి విశాఖపట్నం వెళ్తున్న 68ఙ బస్సు వేగంగా, అజాగ్రత్తగా రాంగ్ రూట్‌లోకి వచ్చి స్కూటీని ఢీకొట్టినట్లు మృతుడి అన్న బోని శంకర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కొత్తవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# థ్యాంక్ యూ సీఎం సార్ :ఏ.పి.ఎన్.జి.జి.ఓ నాయకులు



**కొత్తవలస, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కొత్తవలస తాలూకా ఏ.పీ.ఎన్.జి.జి.ఓ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చిత్ర పటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. థ్యాంక్ యూ సీఎం సార్ కార్యక్రమంలో లో భాగంగా ప్రభుత్వం ఉద్యోగులు కి పి.ఆర్.సి కమిషన్ వేసినందుకు, తక్షణమే రెండు డి.ఏ. లు ఇచ్చినందుకు, పెన్షనర్స్ కి అదనపు క్వాంటం పెన్షన్. మంజూరు చేసినందుకు ధన్యవాదం తెలుపుతూ పాలాభిషేకం చేశారు. ఏపీ జే.ఏ.సి చైర్మన్ జె.వి. ప్రసాద్, కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు పెన్షనర్స్ నాయకులు వెంకటేశ్వరరావు, జోగారావు, కృష్ణమా చార్యులు, యు.టి.ఎఫ్ నాయకులు జి. వెంకట నాయుడు, కె. ఈశ్వర రావు, ఏ.పి.టి.ఎఫ్ నాయకులు జి. శ్రీనివాసరావు, ఐ. సత్య నారాయణ, సంఘ నాయకులు ఎల్. సత్యారావు, కళావతి, సన్యాసినాయుడు, దిలీప్, అప్పలకొండ, బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

# తాళ్ల వెంకటేష్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు : టీఎన్‌యూఎస్



**గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్ యాదవ్ జన్మదిన సందర్భంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (TNUS) గుంటూరు జిల్లా టీమ్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో (TNUS) రాష్ట్ర కార్యదర్శి ఎన్.వి. జగదీష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పసల బాలస్వామి, జనరల్ సెక్రటరీ పాలేటి జగదీష్ బాబు, గౌరవ సలహాదారులు కె. ఫణిదత్తు, కె. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్.వి. జగదీష్ కుమార్ మాట్లాడుతూ.. తాళ్ల వెంకటేష్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని కోరారు. ఆయన చేపట్టే కార్యక్రమాల్లో (TNUS) ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, బలహీన వర్గాల సంక్షేమం కోసం తాళ్ల వెంకటేష్ యాదవ్ చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని, ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు దక్కాలని (TNUS) గుంటూరు జిల్లా టీమ్ ఆకాంక్షించింది. ప్రజా సేవలో ఆయనకు తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేసింది.

# ఘనంగా శ్రీ వీరభద్రస్వామి 25వ వార్షిక మహోత్సవం



**గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో కొలువై ఉన్న శ్రీ వీరభద్రస్వామి వారి 25వ వార్షిక మహోత్సవాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పూర్ణకుంభ స్వాగతం అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏఆర్ డీఎస్పీ శంకరయ్య దంప తులతో కలిసి ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వంశీ ఆధ్వర్యంలో ఐదుగురు వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల శ్రేయస్సు, జిల్లా ప్రజల శాంతి భద్రతలు సక్రమంగా కొనసాగాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. మహోత్సవం సందర్భంగా సుమారు 1,200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ శంకరయ్య, ఏఆర్ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదును పరిశీలించి తక్షణమే చట్టపరమైన చర్యలు





ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులను స్వీకరించిన కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ డా. మహంతి కిషోర్ కుమార్

**కాకినాడ బ్యూరో, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో (సోమవారం) నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్ మొత్తం 57 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు 15, కుటుంబ కలహాలు18 మరియు ఇతర విభాగాలకు చెందినవి 24 గా గుర్తించబడ్డాయి. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సంబంధిత స్టేషన్ అధికారులను ఆదేశిస్తూ, ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని, వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న అడిషనల్ ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు.

# ఆశా వర్కర్ల జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయండి



సీఐటీయూ పిలుపు



**రేపల్లె, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఈ నెల 17, 18 తేదీలలో రేపల్లె పట్టణంలోని కాటూరి సీతారామయ్య ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ఆశా వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి, యూనియన్ గౌరవాధ్యక్షులు సిహెచ్. మణిలాల్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యురాలు ఎన్. సునంద అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో శిక్షణా తరగతుల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ.. కొవిడ్ వంటి క్లిష్ట సమయాల్లోనూ ప్రాణాలను పణంగా పెట్టి పేదలకు వైద్య సేవలందించిన ఆశా వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయకపోవడం అన్యాయమని, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో వస్తున్న మార్పులు, కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణకు సన్నద్ధమయ్యేందుకు నిర్వహిస్తున్న ఈ తరగతులకు జిల్లావ్యాప్తంగా నాయకులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.ఝాన్సీ, యూనియన్ నాయకులు సిహెచ్. దానమ్మ, సిహెచ్. వీరలక్ష్మి, కె. కీర్తి, పావని, వరలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల పిజిఆర్ఎస్ లో గిరిజన యానాదుల సమస్యలపై వినతిపత్రం అందజేత



**బాపట్ల, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ?బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో, జిల్లాలోని గిరిజన యానాదులు ఎదుర్కొంటున్న పలు మౌలిక వసతులు, సంక్షేమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యానాదుల గిరిజన యూత్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు చౌటూరి రమేష్ జిల్లా యంత్రాంగానికి వినతిపత్రం సమర్పించారు. యానాది వర్గాల జీవనోపాధి, గృహ నిర్మాణం, విద్య, ఇతర సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గిరిజనుల విజ్ఞప్తులపై జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యల శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినందుకు ఈ సందర్భంగా చౌటూరి రమేష్ జిల్లా పాలనా యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తులకు నిస్వార్థ వైద్య సేవలందించేందుకు ముందుకు రండి

## అమెరికాలోని వైద్యులకు టీటీడీ బోర్డు సభ్యుడు సదాశివరావు పిలుపు




**అమరావతి/గుంటూరు, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ వైద్య కళాశాలలైన సిద్ధార్థ మెడికల్ కాలేజ్, రంగరాయ మెడికల్ కాలేజ్, గుంటూరు మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సెప్టెంబర్ 6న అమెరికాలోని అట్లాంటా నగరంలో ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో ఆయా కళాశాలల పూర్వ విద్యార్థులు, పలువురు సూపర్ స్పెషాలిటీ వైద్యులు సహా వెయ్యికి పైగా మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ నన్నపనేని సదాశివరావు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శ్రీవారి వైద్య సేవ' కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, అశ్విని హాస్పిటల్, శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ హాస్పిటల్, ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి, ఎస్వీ గోసంరక్షణ శాల తదితర వైద్య సంస్థల్లో భక్తులకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలని ఆయన వైద్యులకు విజ్ఞప్తి చేశారు. శ్రీవారి వైద్య సేవ కార్యక్రమంపై వైద్యుల నుంచి చక్కటి స్పందన లభించిందని శ్రీ సదాశివరావు తెలిపారు. తాము స్వదేశానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా శ్రీవారి వైద్య సేవలో పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పలువురు వైద్యులు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాల మేరకు భక్తులకు స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించేందుకు టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర శ్రీవారి వైద్య సేవ కార్యక్రమాన్ని జూన్ 5న ట్రయల్ రన్‌గా ప్రారంభించారు. ఇప్పటికే పలువురు వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు. దేశ, విదేశాల్లోని ప్రముఖ వైద్యులను శ్రీవారి వైద్య సేవలో భాగస్వాములను చేయడం ద్వారా భక్తులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు టీటీడీ కృషి చేస్తోందని సదాశివరావు తెలిపారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు !

## పల్నాడు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు




**పల్నాడు జిల్లా, 07 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ నుండి పోటీచేయడంలో ఎట్టిపరిస్థితిలో వెనుకడుగు వేయకూడదని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం నర్సరావుపేటలో వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పల్నాడు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో పెదకూరపాడు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎట్టి పరిస్థితి లో కూడా వెనకడుగు వేయకుండా పోటీ చేసి విజయానికి కృషి చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేయాలని అన్నారు. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు ప్రతీ ఒక్కటి నెరవేరుస్తూ గడప గడప కార్యక్రమానికి మనం అందరం ధైర్యం గా ప్రతీ ఇంటికి వెళ్తే నేడు వారు ఇచ్చిన ఒక్క హామీ ఇవ్వకుండా ఏ ఇంటికి వెళ్ళాలి అన్నా ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతో తెలుగుదేశం పార్టీ ఇళ్లకు మాత్రమే వెళ్తున్నారు అని తెలియజేసారు. అనంతరం కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాజీ మంత్రి విడుదల రజిని, నర్సరావుపేట పార్లమెంటరీ ఇంచార్జి పూనూరు గౌతమ్ రెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గం సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 22ఏ పేరుతో సాగుతున్న భూదందా

**భూదందా వెనుక పొంగులేటి ఉన్నారు.. వేల కోట్లు కొల్లగొడుతున్న పొంగులేటి**

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి..బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**గన్‌పార్క్ వద్ద బీజేపీ తీవ్ర నిరసన**

**హైదరాబాద్,సెప్టెంబర్7 :** రాష్ట్రంలో సెక్షన్ 22ఏ నిషిద్ధ భూముల పేరుతో సాగుతున్న భారీ భూదందా వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హస్తముందని, ఈ అక్రమాల ద్వారా ఆయన వేల కోట్ల రూపాయలు వెనకేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి... రాష్ట్రంలో అసలు రూల్ ఆఫ్ లా అనేది అమలు కావడం లేదని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషిద్ధ భూముల జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల న్యాయమైన భూములను నిలిపివేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆ భూములకు రక్షణ కల్పించి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని కోరారు. 22ఏ భూకుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయడంతో పాటు ఆయన రాజీనామాను ఆమోదించాలని పట్టుబట్టారు. రాబోయే శాసనసభ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు, పోలీస్ నోటిఫికేషన్లు, ధరణి, భూభారతి అక్రమాలపై అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

# పోలీస్ స్టేషన్‌లో యువకుడి హైడ్రామా..

**పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని పరుగులు..!**

**మెదక్ జిల్లా రామాయంపేటలో ఘటన**

**హైదరాబాద్,సెప్టెంబర్ 7 :** మెదక్ జిల్లా రామాయంపేటలో తీవ్ర కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ అనే యువకుడు గత కొద్దిరోజులుగా ఓ యువతిని వేధిస్తున్నాడనే ఆరోపణలపై రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసుల చర్యలపై భయాందోళనకు గురైన యువకుడు తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. పెట్రోల్‌తో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దుర్గాప్రసాద్.. అక్కడే తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలను గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై యువకుడిని రక్షించే ప్రయత్నం చేశారు. అనంతరం తీవ్ర గాయాలతో అతడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. యువకుడు పోలీస్ స్టేషన్‌లోకి పెట్రోల్‌తో ఎలా వచ్చాడు? ఘటనకు ముందు ఏం జరిగింది? కేసు నమోదు చేసిన తర్వాత అతడికి పోలీసుల నుంచి ఎలాంటి చర్యలు ఎదురయ్యాయి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# మ్యాట్రీమోనీ పేరుతో భారీ మోసాలు

**ఫాక్ మ్యాట్రిమోనీతో డబ్బులు వసూలు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 7 :** పెళ్లి కుదరాలి.. పిల్లల జీవితం బాగుండాలి.. అనే తల్లిదండ్రుల ఆశ పడుతుంటారు. తమ స్థాయికి మించి కూడా మంచి సంబంధాల కోసం వెతుకుతుంటారు. బంధువులు తెలిసిన వారితో పాటు ఇటీవల కాలంలో మ్యాట్రీమోనీలను కూడా ఆశ్రయిస్తున్నారు. అయితే తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే నల్గొండ జిల్లాలో వెలుగు చూసింది. మీ అమ్మాయికి పెళ్లి సంబంధం చూస్తున్నారా? పెళ్లి కుదిరిందానండీ.. మాది పలానా మ్యాట్రీమోనీ.. మీ అమ్మాయికి తగిన సంబంధాలు మావద్ద ఉన్నాయి. అబ్బాయి ప్రొఫైల్ పెట్టామంటారా.. అంటూ కేటుగాళ్లు ఫోన్ లో అడుగుతారు. తల్లిదండ్రులు ఆసక్తి చూపగానే వెంటనే వాట్సాప్‌లో ఓ అందమైన అబ్బాయి ఫొటో.. దాంతోపాటు ఆకట్టుకునే ప్రొఫైల్ పంపిస్తారు. ఎన్ఆర్ఐ.. డాక్టర్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భారీ జీతం.. కోట్ల విలువైన ఆస్తులు అంటూ ప్రొఫైల్‌ను నమ్మేలా చేస్తారు. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. మీ పేరు రిజిస్టర్ చేయాలంటే రూ.5 వేలు పంపండి. అబ్బాయి తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఇస్తాం. మరికొన్ని మంచి ప్రొఫైల్స్ కూడా పంపిస్తాం అంటూ నమ్మిస్తారు. పెళ్లి సంబంధం కుదిరే ఆశతో తల్లిదండ్రులు డబ్బులు పంపిస్తారు. డబ్బులు అందిన కొద్దిసేపటికే అబ్బాయి తల్లిదండ్రుల పేరుతో ఓ ఫోన్ నంబర్ ఇస్తారు. కానీ ఆ నంబర్‌కు కాల్ చేస్తే.. "ఈ నంబర్ ప్రస్తుతం పనిచేయడం లేదు" అనే సమాధానం వస్తోంది. మ్యాట్రిమోనీకి ఫోన్ చేస్తే.. స్విచ్ఛాఫ్ వస్తుంది. వాట్సాప్‌లో పంపిన ప్రొఫైల్ లేదు.. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి లేడు.. డబ్బులు మాత్రం తిరిగి రాక తల్లిదండ్రులు సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారు. వీటితోపాటు మరో తరహాలోనూ ఈ మోసాలు జరుగుతున్నాయి. ముందుగా పేరున్న మ్యాట్రిమోనీ సంస్థల్లో కొంత మొత్తాన్ని చెల్లించి.. అక్కడి ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తారు. పక్కా వ్యూహంతో వారికి నచ్చిన ప్రొఫైల్స్ పట్టుకుని వేటకు బయలు దేరుతారు. ఎక్కువ కాలంగా సంబంధం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు.. వయసు దాటిపోతున్న యువతీ యువకులు.. రెండో పెళ్లి కోసం చూస్తున్నవారు.. ఇలా ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుంటారు. ఆ తర్వాత తామే మ్యాట్రిమోనీ నిర్వాహకులమని పరిచయం చేసుకుని.. మీకు మంచి సంబంధం కుదురుస్తాం అంటూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అడ్వాన్స్ తీసుకుంటారు. డబ్బులు చేతికి వచ్చాక ఫోన్ ఎత్తరు. ఒకవేళ ఎత్తినా.. సంబంధం మాట్లాడుతున్నాం.. కొంత సమయం పడుతుంది అంటూ కాలయాపన చేస్తారు. చివరకు పూర్తిగా అందుబాటులో లేకుండా పోతారు. మ్యాట్రిమోనీ సంస్థల పేరుతో మోసగాళ్లు పక్కా వ్యూహంతో బాధితులను మోసం చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు.. రూ.10 వేలు మాత్రమే తీసుకుంటారు. బాధితులు కూడా "ఇంత చిన్న మొత్తానికి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇలాంటి వాళ్లు పదుల సంఖ్యలో.. వందల సంఖ్యలో కుటుంబాలను టార్గెట్ చేస్తే.. అదే పెద్ద మొత్తంగా మారుతుంది. ఈ తరహా మ్యాట్రిమోనీ కాల్స్ ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. చిన్న మొత్తాల్లోనే మోసం చేస్తుండటంతో చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అందుకే బయటకు కనిపించే కేసుల కంటే.. వాస్తవంగా మోసపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు. మ్యాట్రిమోనీ పేరుతో ఫోన్ వస్తే వెంటనే నమ్మొద్దని పోలీసులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. సంస్థ పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ, కార్యాలయ చిరునామా, సంప్రదింపు వివరాలు పరిశీలించాలనీ సూచిస్తున్నారు గుర్తింపు లేని వ్యక్తిగత నంబర్లకు డబ్బులు పంపకూడదనీ, అబ్బాయి, కుటుంబ సభ్యుల వివరాలను స్వతంత్రంగా తెలుసుకోవాలని, ఫొటోలు, ఉద్యోగం, ఆస్తుల వివరాలను మాత్రమే నమ్మకూడదనీ సైబర్ నిపుణులు చెబుతున్నారు తొందరపెట్టి డబ్బులు అడిగితే అప్రమత్తం కావాలనీ, మోసం జరిగితే చెల్లింపు వివరాలు, ఫోన్ నంబర్లు, వాట్సాప్ చాట్స్, ప్రొఫైల్ ఫొటోలు భద్రపరచాలనీ సూచిస్తున్నారు.

# ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

**సీఎం రేవంత్ సారీ చెప్పాలి**

**రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్**

**టీషర్టులతో మీరు పార్లమెంట్?కు వెళ్తారు**

**మేము టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?**

**పోలీసుల అభ్యంతరంపై హరీశ్‌రావు**

**ఇది ముమ్మాటికీ దుశ్శాసన సభ..**

**మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?**

**శాంతియుతంగా నిరసనపై ఉక్కుపాదమా!**

**ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉంది**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**






**హైదరాబాద్,సెప్టెంబర్7 :** తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన హరీశ్‌రావు, ప్రస్తుత శాసనసభ ప్రజాస్వామ్యబద్ధంగా నడవడం లేదని, అది కౌరవ సభను తలపిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలోనే ఈరోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని, ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను దుర్మార్గంగా ప్రయోగిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో రావొద్దని బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల అభ్యంతరంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీ షర్టులు విప్పేశారు. బలియన్లపై ఉన్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కేటీఆర్, హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీసుల తీరుపై సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు తన పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వైఖరిని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు. ఈ సందర్భంగా హరీశ్?రావు మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్టులు వేసుకుని పార్లమెంట్‌కు వెళ్లారని, తాము అలా అసెంబ్లీకి రాకూడదా అని ప్రశ్నించారు. నల్ల టీషర్టుపై హామీలు అమలు చేయాలని మాత్రమే ఉందని తెలిపారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్న ఆయన, తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి రాకూడదనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి వస్తే ప్రశ్నిస్తారనే అడ్డుకుంటున్నారని, ప్రధాన ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, బీఆర్?ఎస్? నేతల ఆరోపణలపై ఖైరతాబాద్? డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రావడం నేరం కాదని పేర్కొన్నారు. నల్ల టీషర్టులపై అభ్యంతరకర పదాలున్నాయని తెలిపారు. టీషర్ట్‌లపై ఉన్న పదాల కారణంగానే అసెంబ్లీ లోపలికి అనుమతించలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్న డీసీపీ, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారన్న శిల్పవల్లి, అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటన వీడియోలను పరిశీలిస్తామన్నారు. ఆందోళన సందర్భంగా పోలీసులు ప్రవర్తించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హరీశ్‌రావు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అత్యంత హేయంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగడం, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కడం వంటి ఘటనలు అత్యంత అమానుషమని ధ్వజమెత్తారు. మహిళా సభ్యుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన అధికారులను సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తోపులాటలో జగదీష్ రెడ్డిని కింద పడేసి తొక్కేందుకు యత్నించారని, కేటీఆర్, సంజయ్, యాదవరెడ్డి, రాజశేఖర రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు వైఫల్యాలు, పింఛన్లు, మూడేళ్లుగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్మెంట్, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల నుంచి తప్పించుకోవడానికే ఈ దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలన వాస్తవాలు సభలో బట్టబయలవుతాయనే భయంతోనే తమపై పథకం ప్రకారం కుట్ర పన్ని సస్పెండ్ చేశారని ఆరోపించారు. సభలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ లేకుండా చేసి, బీజేపీ -- కాంగ్రెస్ కలిసి నామమాత్రపు చర్చలతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం చేస్తున్నాయని హరీశ్‌రావు ఎండగట్టారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

# హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులా?

**మహిళా ఎమ్మెల్యేలు అని చూడకుండా దారుణం**

**జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు: సబిత**



**హైదరాబాద్,సెప్టెంబర్ 7 :** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

**శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ**

**హైదరాబాద్,సెప్టెంబర్ 7 :** తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం (సెప్టెంబర్ 07) చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడిన మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ.. ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్సీ తాతా మధు చెప్పారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై.. తనపై దాడి చేసింది ఎవరు? తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు? అలా చేయమని ఎవరు ఆదేశించారు? అంటూ తాను ప్రశ్నించినట్లు తాతా మధు వివరించారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు. స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని తాతా మధు తెలిపారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లు భావిస్తే.. ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై తాతా మధు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.శాసనసభ్యులపై జరిగినట్లు పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం స్పందించాలని తాతా మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే.. శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తాతా మధు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. తాతా మధు ఇచ్చిన తాజా వివరణ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

**1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు**

**అత్యాధునిక ఆరుద్ర రాడార్లుకు ప్రాముఖ్యత**

**కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర**



**న్యూఢిల్లీ:** దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది. సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది. భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

# యెమెన్‌లో మళ్లీ భగ్గుమన్న హింస..

**ప్రభుత్వ దళాలు, హౌతీల మధ్య యుద్ధం**

**నాలుగు రోజుల్లో 117 మంది దుర్మరణం**

**న్యూఢిల్లీ :** యెమెన్‌లో మళ్లీ హింస ప్రజ్వరిల్లింది. ప్రభుత్వ బలగాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య పశ్చిమ ప్రావిన్సులైన తాయిజ్, హోదైదాలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భీకర ఘర్షణల్లో కనీసం 117 మంది మరణించారు. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న యుద్ధ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడంతో దేశంలో మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వైద్య అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం నుంచి మొదలైన ఈ పోరులో 54 మంది ప్రభుత్వ సైనికులు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు. అదే సమయంలో, హోదైదా ప్రావిన్సులోని హౌతీ అధీనంలో ఉన్న ఆసుపత్రుల సమాచారం ప్రకారం, 63 మంది హౌతీ సభ్యులు మరణించారు. దీంతో ఇరుపక్షాల మృతుల సంఖ్య 117కు చేరినట్లు వైద్య వర్గాలు ధ్రువీకరించాయి. వ్యూహాత్మకమైన బాబ్ అల్-మందబ్ జలసంధి సమీపంలో హౌతీలు పెద్ద ఎత్తున దాడులకు దిగడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. గత 24 గంటల్లో హౌతీలు కొన్ని ప్రాంతాల్లో వేగంగా ముందుకు చొచ్చుకురావడంతో, ప్రభుత్వ దళాలు వారిపై ఎదురుదాడికి దిగాయి. శుక్రవారం యెమెన్ ప్రభుత్వ యుద్ధ విమానాలు హోదైదా, తాయిజ్ ప్రావిన్సుల్లోని హూతీల స్థావరాలపై వైమానిక దాడులు జరిపి భూతల దళాలకు మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ సైనిక అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, హౌతీలు స్వాధీనం చేసుకున్న కొన్ని కీలక స్థానాలను ప్రభుత్వ దళాలు మెరుపు వేగంతో జరిపిన ప్రతిదాడిలో తిరిగి చేజిక్కించుకున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో పశ్చిమ యెమెన్‌లో ఇంతటి తీవ్రస్థాయిలో భూతల పోరాటం జరగడం ఇదే మొదటిసారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2014 చివర్లో హౌతీలు రాజధాని సనాతో పాటు ఉత్తర యెమెన్‌లోని చాలా ప్రాంతాలను ఆక్రమించుకోవడంతో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఆ తర్వాత 2015లో, అంతర్జాతీయ గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే.

# మెక్సికోలోని ఘోర ప్రమాదం

**ఓ మతపరమైన వేడుకలో పేలుడు**

**10 మంది మృతి, 64 మందికి గాయాలు**


**న్యూఢిల్లీ:** మెక్సికోలోని ఓ మతపరమైన వేడుకలో ఘోర ప్రమాదం జరిగింది. పటాకుల సామగ్రి భారీగా పేలడంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 64 మంది గాయపడ్డారు. పేలుడు ధాటికి ఓ గోడ కూడా కూలిపోయింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందా అన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. మెక్సికోలోని టెమాస్కాల్సింగో పట్టణంలో ఆ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికంగా నిర్వహిస్తున్న ఓ మతపరమైన వేడుకలో భాగంగా బాణసంచా ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని నుఎస్ట్రా సెనరో డి లా లూజ్ చర్చి సమీపంలో ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. మతపరమైన వేడుక కావడంతో కార్యక్రమాన్ని చూసేందుకు వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. పటాకుల ప్రదర్శన ప్రారంభం కావడానికి సిద్ధమవుతున్న సమయంలో పేలుడు సంభవించడంతో ఒక్కసారిగా అక్కడ భయానక వాతావరణం నెలకొంది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారు. పేలుడు తీవ్రతకు సమీపంలోని ఓ గోడ కూలిపోయింది. శిథిలాలు చెల్లాచెదురుగా పడటంతో పలువురు గాయపడ్డారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. ఏం జరిగిందో అర్థం కాక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో పేలుడు తర్వాత దృశ్యాలు కనిపిస్తున్నాయి. పొగ, శిథిలాల మధ్య పలువురు వ్యక్తులు ప్రాణాలతో ఉన్నవారి కోసం వెతుకుతున్నట్లు వైరల్ అవుతున్న వీడియోల్లో కనిపిస్తోంది. మరికొందరు అక్కడి నుంచి పరుగులు తీస్తున్న దృశ్యాలు కూడా కనిపించాయి. ఘటనలో మొత్తం 64 మంది గాయపడినట్లు మెక్సికో అధికారులు వెల్లడించారు. క్షతగాత్రుల్లో ఇద్దరు మతగురువులు కూడా ఉన్నారని స్థానిక బిషప్ తెలిపారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. అసలు పేలుడు ఎందుకు సంభవించిందన్నది ఇంకా తెలియరాలేదు. పటాకుల సామగ్రి పేలుడే ప్రమాదానికి కారణమని అధికారులు ప్రాథమికంగా చెబుతున్నప్పటికీ, అది ఎలా పేలిందన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మెక్సికో అటార్నీ జనరల్ కార్యాలయం ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది. బాణసంచా నిల్వ, నిర్వహణ, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి నిర్లక్ష్యం కారణమా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్న కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

# భగ్గుమన్న చమురు ధరలు!!

**హర్మ్యూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత**

**భారీగా తగ్గిన నౌకల రాకపోకలు**

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య నౌకలపై పరస్పర దాడులు జరగడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ చమురు రవాణాలో కీలకమైన హర్మ్యూజ్ జలసంధి సమీపంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో సరఫరాకు దీర్ఘకాలిక అంతరాయం కలుగుతుందన్న భయాలు మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి ప్రతిగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కూడా అమెరికా నౌకలతో పాటు, అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ పరిణామాలను విశ్లేషకులు 'ప్రధాన ఘర్షణ'గా అభివర్ణిస్తున్నారు. ఈ ఘర్షణల ప్రభావం హర్మ్యూజ్ జలసంధిపై తీవ్రంగా పడింది. సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ నౌకల రాకపోకలు భారీగా పడిపోయాయి. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 10కి పరిమితమైంది. త్వరలో ఈ ప్రాంతంలో కొత్తగా 'రిస్ట్రిక్టెడ్ జోన్' ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ



బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 0.54 శాతం పెరిగి 96.80 డాలర్లకు చేరుకుంది. అమెరికా బెంచ్‌మార్క్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 0.72 శాతం పెరిగి 92.14 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత వారంలోనే ఈ ధరలు 8-10 శాతం వరకు పెరిగాయి. మరోవైపు, సెప్టెంబర్ 6న సమావేశమైన ఒపెక్ ప్లస్ దేశాలు అక్టోబర్ ఉత్పత్తి విధానంలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించాయి. హర్మ్యూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 చివరి వరకు ఎగుమతులు పరిమితంగానే ఉంటాయని, పూర్తిస్థాయి పునరుద్ధరణ 2027లోనే సాధ్యమవుతుందని కొన్ని సంస్థలు అంచనా వేశాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. తదుపరి దాడులు, దౌత్యపరమైన చర్చలపైనే మార్కెట్ గమనం ఆధారపడి ఉంటుంది.

# పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

**గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు**

**న్యూఢిల్లీ:** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

# నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో అస్థిరత, వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. సెన్సెక్స్ 382.62 పాయింట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు సుమారు 0.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సాంకేతికంగా కీలక స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,800 స్థాయి గతంలో కీలక మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలదొక్కుకోకపోతే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు 23,750-23,700 స్థాయిని తక్షణ మద్దతుగా నిపుణులు చూస్తున్నారు. ఈ స్థాయి కంటే దిగువన నిఫ్టీ ముగిస్తే మరింత అమ్మకాలు జరిగి 23,600 ప్రాంతం వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం స్వల్పంగా పెరిగింది. రంగాల వారీగా ఐటీ, మెటల్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లు కూడా వెనుకబడ్డాయి. అయితే ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు మాత్రం మార్కెట్ ప్రతికూలతను తట్టుకొని మెరుగ్గా రాణించాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి పెట్టారు.

# సింగపూర్‌లో భారతీయులపై ద్వేషపూరిత వ్యాఖ్యలు..

**విచారణకు ఆదేశించిన సింగపూర్ ప్రభుత్వం**

**న్యూఢిల్లీ :** సింగపూర్‌లో స్థానిక భారతీయులను, భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో సాగుతున్న జాత్యహంకార, ద్వేషపూరిత వ్యాఖ్యలపై ఆ దేశ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల చైనా-నేపాల్ సరిహద్దుల్లో సంభవించిన ప్రకృతి వైపరీత్యంలో పలువురు సింగపూర్ పౌరులు గల్లంతైన ఘటనలతో పాటు, ఎయిర్ ఇండియాల్లో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడుల వ్యవహారాన్ని ముడిపెడుతూ కొంతమంది ఆన్‌లైన్‌లో భారతీయులపై తీవ్ర స్థాయిలో ద్వేషాన్ని చిమ్మడంపై సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, సీనియర్ మంత్రులు కే. షణ్ముగం, లీ సీన్ లూంగ్‌లు తీవ్రంగా స్పందించారు. ఈ జాత్యహంకార వ్యాఖ్యలను "అత్యంత సిగ్గుచేటు, హేయం, ఎంతమాత్రం సహించరానివి"గా అభివర్ణించిన సీనియర్ మంత్రి కె.షణ్ముగం, వీటిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సమాజంలో మత, జాతిపరమైన సామరస్యానికి భంగం కలిగించే ఈ పోస్టులను వెంటనే తొలగించాలని డిజిటల్ అభివృద్ధి, సమాచార మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను కోరింది. ఏ ఒక్క వర్గంపైనా ద్వేషాన్ని సాధారణ అంశంగా మారనివ్వబోమని, తప్పు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సింగపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా**

**12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు**

బాఘ్‌పత్, సెప్టెంబర్7(ఆర్‌ఎన్‌ఎ): ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

**శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్**

**హైదరాబాద్ :** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# ఇషాన్ కిషన్ విశ్వరూపం..



**ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు**

**దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ పరుగుల వరద**

**కెప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో అద్భుత డబుల్ సెంచరీ**

**కుమార్ కుశాగ్ర కూడా శతకంతో రాణింపు**

**రెండో ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు నమోదు**

**సౌత్ జోన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్న ఈస్ట్ జోన్**

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) రికార్డు డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. అతనికి కుమార్ కుశాగ్ర (101) శతకంతో జత కలవడంతో, ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో సౌత్ జోన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ విజయం దిశగా పటిష్ఠమైన పునాది వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 385/4తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్, ఆరంభం నుంచే పరుగుల వరద పారించింది. వికెట్ల కోసం తీవ్రంగా ప్రయత్నించిన సౌత్ జోన్, కొత్త బంతిని తీసుకున్నా ఫలితం లేకపోయింది. పేసర్లు మహ్మద్ సిరాజ్, ఎండీ నిధీశ్ బౌలింగ్‌ను ఇషాన్ కిషన్ సమర్థంగా ఎదుర్కొని బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మరో ఎండ్‌లో కుశాగ్ర కూడా దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. లంచ్‌కు ముందు కుమార్ కుశాగ్ర తన ఆరో ఫస్ట్‌క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత త్రిపురాణ విజయ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి ఫైన్ లెగ్ వద్ద ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కుశాగ్ర ఔటైనా ఇషాన్ కిషన్ తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. అలసిపోయిన సౌత్ జోన్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని, సులువుగా బౌండరీలు బాదుతూ 270 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. డబుల్ సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడిన ఇషాన్ కిషన్, ట్రిపుల్ సెంచరీ వైపు దూసుకెళ్లాడు. ఈ క్రమంలో కాస్త అలసటకు గురై తాత్కాలికంగా రిటైర్ అయినా, మహ్మద్ షమీ (28) ఔటైన తర్వాత తిరిగి క్రీజులోకి వచ్చాడు. అయితే, మరోవైపు వికెట్లు పడుతుండటంతో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగ్ ఆన్ బౌండరీ వద్ద క్యాచ్ ఔటయ్యాడు. కేవలం 30 పరుగుల తేడాతో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. తన 334 బంతుల ఇన్నింగ్స్‌లో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే ఇది 8వ అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం విశేషం. చివరకు ఈస్ట్ జోన్ 163 ఓవర్లలో 708 పరుగులకు ఆలౌట్ అయింది. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురాణ విజయ్ 4 వికెట్లు పడగొట్టగా, చామ మిలింద్ 2 వికెట్లు తీశాడు. ఈ భారీ స్కోరుతో ఈస్ట్ జోన్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.

**సంక్షిప్త స్కోరు:**

ఈస్ట్ జోన్: 163 ఓవర్లలో 708 ఆలౌట్ (ఇషాన్ కిషన్ 270, కుమార్ కుశాగ్ర 101; త్రిపురాణ విజయ్ 4/180, చామ మిలింద్ 2/88).



## పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత క్రీడా జట్లకు పచ్చజెండా..!

**2027లో పాకిస్థాన్‌లో జరగనున్న శాఫ్ గేమ్స్**

**పాల్గొనేందుకు భారత జట్లకు కేంద్రం అనుమతించినట్టు కథనాలు!**

**పహల్గామ్ దాడి తర్వాత ఇదే తొలి పర్యటన కానుంది**

**వార్తలను ప్రముఖంగా ప్రచురించిన పాకిస్థాన్ మీడియా**

**క్రికెట్, హాకీతో పాటు 28 క్రీడల్లో పోటీలు**


భారత్, పాకిస్థాన్ మధ్య క్రీడా సంబంధాల పునరుద్ధరణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత క్రీడా బృందాలకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అనుమతించినట్లు వార్తలు వెలువడ్డాయి. 2027లో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న సౌత్ ఏషియన్ ఫెడరేషన్ (శాఫ్) గేమ్స్‌లో భారత క్రీడాకారులు పాల్గొంటారని పాకిస్థాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని, దీంతో భారత బృందం పాకిస్థాన్‌కు వెళ్లనుందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలు నిజమైతే, పహల్గాం దాడి తర్వాత భారత క్రీడాకారులు పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టడం ఇదే తొలిసారి అవుతుంది. గతంలో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాల కారణంగా ఇరు దేశాల మధ్య క్రీడా కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. భారత క్రికెట్ జట్టు చివరిసారిగా 2008లో పాకిస్థాన్‌లో పర్యటించగా, హాకీ జట్టు 2006లో ఆ దేశానికి వెళ్లింది. కాగా, 2027 శాఫ్ గేమ్స్‌లో క్రికెట్, హాకీతో పాటు మొత్తం 28 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత జట్ల పర్యటన వార్త క్రీడా వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, దీనిపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



## అలా చేసినంత కాలం జట్టులో నా చోటుకు ఢోకా ఉండదు: పడిక్కల్

భారత టెస్టు జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే నిరంతరం పరుగులు చేయడమే మార్గమని యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అన్నాడు. జట్టు విజయాల్లో తన వంతు పాత్ర పోషిస్తూ మంచి ప్రదర్శన కొనసాగిస్తే చోటు గురించి ఆందోళన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశాడు. శ్రీలంక పర్యటనలో పడిక్కల్ సత్తా చాటాడు. వరుసగా రెండు శతకాలు బాదాడు. భారత్ 1-0తో సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును సైతం అందుకున్నాడు. సాయి సుదర్శన్ అందుబాటులో లేకపోవడంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ ఆకట్టుకున్నాడు. తనకు అవకాశం వస్తుందని ముందే తెలియడం ఉత్సాహాన్నిచ్చిందని పడిక్కల్ చెప్పాడు. "అవకాశాలు అంత సులభంగా రావు. వాటి కోసం ఎంతో కష్టపడాలి. అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. సిరీస్ ఆరంభంలోనే ఆడతానని చెప్పడంతో చాలా సంతోషించా. బ్యాటింగ్ పరంగా నా కెరీర్‌లోనే అత్యుత్తమ దశలో ఉన్నానని భావించా" అని జియోస్టార్‌తో చెప్పాడు. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడంపై వచ్చే అంచనాలు, పోలికల గురించి కూడా స్పందించాడు. రాహుల్ ద్రవిడ్, ఛతేశ్వర్ పుజారా వంటి దిగ్గజాలు ఆ స్థానంలో ఆడారని గుర్తు చేశాడు. అయితే వారితో పోల్చుకోవడంపై తాను దృష్టి పెట్టనని స్పష్టం చేశాడు. "ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నానన్నది ముఖ్యం కాదు. జట్టుకు నా వంతు సహకారం అందించడమే లక్ష్యం" అని అన్నాడు. టెస్టు బ్యాటింగ్‌పై తన ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దడంలో ద్రవిడ్ సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని పడిక్కల్ తెలిపాడు. ఎక్కువసేపు క్రీజులో నిలవాలంటే సరైన సంసిద్ధత, స్పష్టమైన ప్రణాళిక అవసరమని ద్రవిడ్‌తో జరిగిన చర్చల నుంచి నేర్చుకున్నట్లు చెప్పాడు. "టెస్టుల్లో అవకాశాలు పరిమితంగా ఉంటాయి. జట్టులో చోటు సుస్థిరం చేసుకోవడం అంత సులభం కాదు. ఏదీ శాశ్వతం కాదు. నేను పరుగులు చేస్తూ, భారత టెస్టు జట్టు విజయాలకు తోడ్పడాలనుకుంటున్నా. అలా చేస్తున్నంతకాలం జట్టులో నాకు చోటు ఉంటుందని నమ్ముతున్నా" అని పడిక్కల్ పేర్కొన్నాడు.

## డ్రెస్సింగ్ రూమ్‌లో ఏం జరుగుతోంది?.. పాక్ జట్టుపై పీసీబీ ఫోకస్




ఇంగ్లాండ్ పర్యటనలో పాకిస్థాన్ క్రికెట్ జట్టులో నెలకొన్న గందరగోళంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తనపై వస్తున్న ఆరోపణలను పరిశీలించేందుకు అంతర్గత విచారణ ప్రారంభించింది. డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు తలెత్తాయంటూ స్థానిక మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో ఈ చర్య చేపట్టినట్లు బోర్డు తెలిపింది. ఇంగ్లాండ్‌తో తొలి రెండు టెస్టుల్లో పాకిస్థాన్ ఘోర పరాజయాలను చవిచూసింది. హెడింగ్లీలో జరిగిన తొలి టెస్టులో, లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టులో ఓటమి తర్వాత జట్టు వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పర్యటన మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపించారు. వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్, టీ20 కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కూడా ఈ జాబితాలో ఉన్నారు. ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను కూడా స్వదేశానికి పంపించారు. వారి స్థానాల్లో మైక్ హెసన్, యాష్లీ నాఫ్కే బాధ్యతలు చేపట్టారు. పీసీబీ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అమీర్ మీర్ ఈ విషయాన్ని 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. క్రమశిక్షణ, ప్రవర్తనకు సంబంధించిన అంశాలను బోర్డు నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న నిర్ధారణ లేని ఆరోపణలను నమ్మొద్దని సూచించారు. అధికారిక ప్రకటనలనే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే పీసీబీ చర్యలపై మాజీ క్రికెటర్లు, నిపుణుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) జాబితాలో పాకిస్థాన్ ప్రస్తుతం చివరి స్థానంలో ఉంది. ఈ పరిస్థితుల్లో సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లో మూడో టెస్టు ప్రారంభం కానుంది. బాబర్ ఆజమ్ నేతృత్వంలోని మార్పులతో కూడిన జట్టు ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ వైట్‌వాష్‌ను తప్పించుకోవాలని చూస్తోంది.




## పాక్ కెప్టెన్‌కు ఐసీసీ ఫైన్..

**షఫాలీని ఔట్ చేసి సైగలు చేయడంతో చర్యలు**


మహిళల ఆసియా కప్‌లో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా ఐసీసీ క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించింది. టీమిండియా బ్యాటర్ షఫాలీ వర్మ వికెట్ తీసిన అనంతరం అనుచితంగా ప్రవర్తించినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు, ఆమె ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్ షఫాలీ వర్మ (12) ఫాతిమా సనా బౌలింగ్‌లోనే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. వికెట్ తీసిన ఉత్సాహంలో ఫాతిమా, షఫాలీని ఉద్దేశించి పెవిలియన్ వైపు వెళ్లాలంటూ వేలితో సైగ చేస్తూ అనుచితంగా ప్రవర్తించింది. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్-1 నిబంధనలను ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే ఆమెకు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత 24 నెలల కాలంలో ఫాతిమా సనాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్ కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టు 6న ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో అంపైర్ ఔట్ ఇచ్చినప్పటికీ క్రీజు వదిలి వెళ్లేందుకు నిరాకరించినందుకు ఆమె ఖాతాలో తొలి డీమెరిట్ పాయింట్ చేరింది.




## బ్లాక్ అండ్ బోల్డ్ లుక్‌లో రాశీ ఖన్నా

టాలీవుడ్ అందాల భామ రాశీ ఖన్నా తన గ్లామర్‌తో, నటనతో సోషల్ మీడియాలో నిత్యం హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పోస్ట్ చేసిన గ్లామరస్ ఫోటోషూట్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. 'ఆఫ్టర్ అవర్స్' అంటూ ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ పిక్స్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. మినిమలిస్ట్, కాంటెంపరరీ మోడరన్ లుక్‌లో రాశీ ఖన్నా ఇచ్చిన కిల్లింగ్ ఫోజులు ఇప్పుడు కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. విశేషాలు చూద్దాం.. తాజా ఫోటోషూట్ కోసం రాశీ ఖన్నా ఒక విభిన్నమైన బ్లాక్ కలర్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. షీర్ ప్యానెల్స్ డిజైన్‌తో ఉన్న హాల్టర్ నెక్ బాడీసూట్, దానికి తగ్గట్టుగా హై-వేస్టెడ్ ట్రౌజర్స్ ధరించి స్టైలిష్‌గా మెరిసిపోయింది. ఇక ఫిట్‌గా ఉండే ఈ డ్రెస్సులో ఆమె గ్లామర్ మరింత ఎలివేట్ అవుతోంది. ఈ సింపుల్ అండ్ క్లాసీ లుక్ ఆమె అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ అదిరిపోయే స్టైలిష్ లుక్‌ను సెలబ్రిటీ స్టైలిస్ట్ షీఫా జిలానీ చాలా పర్‌ఫెక్ట్‌గా క్యూరేట్ చేశారు. రాశీ ఖన్నాకు సూట్ అయ్యేలా హెయిర్, మేకప్‌ను సారా సాయా మరియు సంజన జి అందించగా, ప్రముఖ ఫొటోగ్రాఫర్ అమన్ అగోషే తన కెమెరాతో ఈ అందమైన పిక్స్‌ను క్యాప్చర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. గ్లామర్‌తోనే కాకుండా నటనతో కూడా రాశీ ఖన్నా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్లు అందుకుంటోంది. గత ఏడాది సిద్ధూ జొన్నలగడ్డ సరసన నటించిన 'తెలుసు కదా' రొమాంటిక్ డ్రామాతో పాటు, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన భారీ యాక్షన్ మూవీలో కీలక పాత్ర పోషించి మెప్పించింది. ఇక తెలుగులో అగ్ర కథానాయకుల సరసన నటిస్తూ తన మార్కెట్‌ను పెంచుకుంటోంది.

## 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్‌ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది. ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



## 'రంభ ఊర్వశి మేనక' కలెక్షన్స్ జోరు

ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ 'రంభ ఊర్వశి మేనక'పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి. కథ పరంగా కన్ఫ్యూజన్ ఏమి లేదు, రన్‌టైమ్ తక్కువగా ఉండటం, నరేష్ తన మార్క్ కామెడీతో నెట్టుకురావడం సినిమాకు కలిసొచ్చింది. దర్శకుడు చంద్రమోహన్ నరేష్ కు తగ్గ ఫన్ ను క్రియేట్ చేశాడు, హాస్య మూవీస్ నిర్మాణ విలువలు సినిమా స్కేల్‌కు సరిపోయేలా ఉన్నాయి. పెద్దగా హంగులకు పోకుండా కేవలం ఫన్ ట్రాక్స్‌పైనే ఫోకస్ పెట్టడంతో బాక్సాఫీస్ వద్ద వీకెండ్ వరకు ఒక మోస్తరుగా నిలబడగలిగింది. అయితే చిత్రానికి అసలైన ఛాలెంజ్ సోమవారం నుంచే మొదలవుతోంది. వీకెండ్‌లో వచ్చిన డీసెంట్ నంబర్స్ మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు వర్కింగ్ డేస్‌లో కంటిన్యూ అవ్వడం అంత సులువు కాదు. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.



## ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?

లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. -అరుంధతి-, -భాగమతి-, -బాహుబలి- వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం -కథనార్: ది విల్డ్ సోర్సరర్- లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. -కథనార్- చిత్రం పాన్-ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ ఫలితం తారుమారైతే స్వీటీ పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమకు గుడ్ బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అనుష్క శెట్టి గ్లామర్ పాత్రలకే పరిమితం కాలేదు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హీరోలకు సమానంగా వసూళ్లు రాబట్టిన నటి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న అమ్మడు పరిశ్రమను వీడుతున్నారనే వార్తలు అభిమానులను నిరాశకు గురి చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా స్వీటీ తిరిగి పూర్తిస్థాయిలో సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఏది ఏమైనా? -కథనార్- చిత్రం విడుదలయ్యే వరకు ఈ ప్రచారాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అనుష్క నిర్ణయం ఏదైనా? అమ్మడు మళ్లీ పూర్వ వైభవంతో వెండితెరపై మెరవాలని.. మరిన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు మాత్రం బలంగా కోరుకుంటున్నారు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342